క్లుప్తంగా

వెంకన్నకు విశేష అలంకరణ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

శ్రీరామక్రతువుకు ఆహ్వానం



కమినషర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉమారుద్రకోటేశ్వరాలయం నాగావళి రేవు వద్ద ఈ నెల 22న లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నిర్వహణలో నిర్వహించనున్న శ్రీరామ క్రతువుకు మున్సిపల్ కమిషనర్ ఓబులేసుకు శనివారం ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ నదిలో సూర్యనమస్కారాలు, సీతారాములకు అర్చన, శ్రీరామ జయరామ నామ జపం, తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంటర్ నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న లలితాదేవి

ఎచ్చెర్ల: కేకేనాయుడుపేట గ్రామంలోని లలితాదేవి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమావాస్య ఉత్తరపూర్తి సందర్భంగా అమ్మవారికి పాలభిషేకం, పంచామృతం, కుంకుమ పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు వంశీకుమార్, ధర్మకర్త నర్సింగరెడ్డి, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

రణస్థలం: నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని ఎంఈవో-2 బి.లావణ్య తెలిపారు. మండలంలోని జె.ఆర్.పురం హైస్కూల్, ఆదర్శ పాఠశాల కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 556 మందికి 443 మంది హాజరైనట్టు చెప్పారు.


ధ్యానంతో ఆహ్లాదం



కార్యక్రమంలో పాల్గొన్న పిరమిడ్ సొసైటీ ట్రస్టు సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో మనిషికి ఆహ్లాదం కలుగుతుందని ఆత్మజ్ఞాన బోధకులు శ్రీనివాస గాంధీ అన్నారు. పొన్నాడ బ్రిడ్జి సమీపంలోని ఇస్కాన్ జగన్నాథ మందిరంలో పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ, శ్రీకాకుళం పత్రీజీ పిరమిడ్ సొసైటీ విశాఖపట్నం సంయుక్త ఆధ్వర్యంలో పత్రీజీమహిళా మౌన ధ్యాన యాగం నిర్వహించారు. పీఎస్ఎస్ఎం లక్ష్యాలు, భగవద్గీతపై ప్రసంగించారు. కార్యక్రమంలో పత్రీజి పిరమిడ్ ట్రస్టు చైర్మన్ రేవతి, పీఎస్ఎం అధ్యక్షుడు బాలాజీ, బిందుమాధవి, శివ, లక్ష్మీ, శ్రీనివాస గురుపాద పాల్గొన్నారు.

పెరటికోళ్లు పంపిణీ



మహిళా సమాఖ్య సభ్యులకు కోళ్లు అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 21 మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు శనివారం 210 పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మూల కృష్ణవేణి మాట్లాడుతూ ఆర్థిక అవసరాలతో పాటు కుటుంబ సభ్యుల పోషణకు పెరటికోళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఎం వి.సుజాత, సీసీలు లక్ష్మీ, పద్మ, స్వప్న పాల్గొన్నారు.

మహిళలకు ఆసరా

- వైఎస్సార్ ఆసరాతో ఆర్థికాభ్యున్నతి
- శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో 61,363 మందికి లబ్ధి



టైలరింగ్ షాపులో ముద్దాడ లక్ష్మి



ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అందులో వైఎస్సార్ ఆసరా ఒకటి. మహిళల బతుకులకు భరోసానిచ్చేందుకు 2019 ఏప్రిల్ వరకు పాత రుణాలను మాఫీ చేస్తానన్న హామీని నిలబెట్టుకుని ఎంతోమందికి ఆసరా కల్పించారు. పేద మహిళల బతుకుల్లో భాగ్య రేఖలు నింపారు. ఇప్పటికి మూడు విడతల సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. నాలుగో విడత అమలుకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జగనన్న మేలును మరువలేమని చెబుతున్నారు.

–శ్రీకాకుళం(పీఎన్ కాలనీ)

శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో 2019-2020 నుంచి 2023-2024 వరకు ఇలా వైఎస్సార్ ఆసరా ఇలా..

ఎస్‌హెచ్‌జీలు	లబ్ధిదారులు	పొందిన లబ్ధి
1526	15305	రూ 11.95కోట్లు
1531	15229	రూ 11.92కోట్లు
1534	15394	రూ 11.95కోట్లు
1539	15435	రూ 12.03కోట్లు(ఇంకా జమ చేయాల్సి ఉంది)
6130	61363	రూ 47.85 కోట్లు



నా పేరు ముద్దాడ లక్ష్మి. 2016లో శ్రీదేవి స్వయం సహాయక సంఘంలో చేరాను. మొదటగా రూ.5వేలు అప్పుగా తీసుకొని కుట్టుమిషన్ కొనుక్కున్నాను. తర్వాత 2017లో రూ.25వేలు అప్పుగా తీసుకున్నాను. 2019లో రూ.40వేలు బ్యాంక్ ద్వారా రుణం పొందాను. 2019 ఏప్రిల్ 11 ఎన్నికల నాటికి ఉన్న అప్పు మొత్తం రుణమాఫీగా వచ్చింది. అందులో నా వంతుగా రూ.20 వేలు మాఫీ అయ్యింది. మూడు విడతలుగా రూ.15వేలు అందింది. నాలుగో విడతగా రూ.5వేలు అందుకోబోతున్నాను. టైలరింగ్ షాపు ద్వారా కుట్టుకుంటూ పదిమంది మహిళలకు శిక్షణ కూడా ఇస్తున్నాను. సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

కుటుంబానికి చేదోడుగా..



2009లో శ్రీ భద్ర మహంకాళి స్వయం సహాయక సంఘంలో చేరాను. 1–2 లింకేజీలకు గాను రూ.30 వేలు రుణం పొంది చిన్న కిరాణా దుకాణం ఇంట్లో పెట్టాను. 2019లో రూ.50 వేలు అప్పుగా పొందాను. అందులో రూ.38వేలు రుణమాఫీ అయ్యింది. ఆసరా కింద మూడు విడతలుగా రూ.28,500 అందుకున్నాను. నాలుగో విడతగా రూ.9,500 అందుకోబోతున్నాను.

– కలివరపు రూప, శ్రీభద్ర మహంకాళీ సంఘం, శ్రీకాకుళం

జాతి ఐక్యతకు నిదర్శనం రామమందిరం

శ్రీకాకుళం కల్చరల్: భారతజాతి ఐక్యతకు అయోధ్య రామమందిరం నిదర్శనంగా నిలుస్తోందని, ప్రపంచంలోనే అత్యద్భుత కట్టడంగా రామ మందిరం నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల నుంచి అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నగరమంతా జైశ్రీరామ్ నినాదాలు, జెండాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు హారికా ప్రసాద్, వాకర్స్ సంఘాల నేతలు జి.ఇందిరాప్రసాద్, బి.వి.రవిశంకర్, ఎస్.జోగినాయుడు, డాక్టర్ ఎం.వాసుదేవాచారి, గోలి సంతోష్, ఎం.మల్లిబాబు, గోలి ఉమామహేశ్వరరావు, గుడ్ల సత్యనారాయణ, కొంక్యాన మురళీధర్, అయ్యప్పస్వామి సన్నిధానం ప్రతినిధి పాలకొండ ప్రశాంత్, భజరంగ్ దళ్ కార్యదర్శి ఎం.రాజశేఖర్, డాక్టర్ వై.పోలినాయుడు, మహిళా కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అడపా మోహన్‌రాజ్, సింహాద్రి వేణుగోపాల్, జైశ్రీరామ్ అప్పారావు, ఐ.కె.రావు పాల్గొన్నారు.

బలగ హరేరామ మందిరం ఆధ్వర్యంలో..

అయోధ్య రామమందిర ప్రతిష్టాపనోత్సవాల సందర్భంగా ఈ నెల 22న బలగ హరేరామ మందిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారులతో హనుమాన్ చాలీసా పారాయణ, దివ్య జీవన సంఘం ఆధ్వర్యంలో రామ రక్షాస్తోత్ర పారాయణ, ఇస్కాన్ భక్తులతో హరినామ సంకీర్తన, పి.గంగాధర్ మాస్టర్‌చే శ్రీరామ కథా గానం, సాయంత్రం దీపాలంకరణ నిర్వహించనున్నట్లు వివరించారు.

జేసీస్ ఆధ్వర్యంలో

అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) మెయిన్ సంస్థ ఆధ్వర్యంలో హోటల్ విజేత ఎదురుగా రామ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పాలఖండ్యాంలో సంకల్పయాత్ర



సంకల్పయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ నాయకుడు వజ్జిపర్తి రఘురాం, మీసాల రామకృష్ణంనాయుడు అన్నారు. పాలఖండ్యాం సచివాలయంలో సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను శనివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. సంకల్పయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ధారబోయిన ధర్మారాజ్, గర్లంకి శ్రీనివాసరావు, రాయపురెడ్డి సూర్యనారాయణ, లోపింటి జీవన్, వద్దాది ఆదినారాయణ, ఎంఈవోలు అరసాడ రవి, ముక్తు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రాజా రమేష్, వీఆర్వో దుర్గయ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ పాగిరి నారాయణరావు పాల్గొన్నారు.

రిమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు సత్కారం



జోగు రాజును సన్మానిస్తున్న ఆదిత్యవాకర్స్ క్లబ్ గవర్నర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రిమ్స్ సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమితులైన జోగు రాజును ఆదిత్య వాకర్స్ క్లబ్ గవర్నర్ పోలుమహంతి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. శ్రీకాకుళం నగరంలో ఓ ప్రయివేటు భవనంలో శనివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాజు కేజీహెచ్‌లో మంచి సేవలందించి పదోన్నతిపై ఇక్కడికి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యకళాశాల పరిపాలనాధికారి పి.వెంకటసాయిమనోజ్, మన్యం జిల్లా ఫైర్ అధికారి పి.వి.ఎస్.రాజేష్, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, శర్మ, ప్రదీప్, నూకరాజు, బి.వి.ఎస్ ప్రభు, జవహార్, వద్దాది శ్రీనివాసరావు, జి.ఆర్.జి.నాయుడు, బురిడి గౌరీశంకర్ పాల్గొన్నారు.

శరవేగంగా కుల గణన సర్వే సాగాలి



సర్వేలో పాల్గొన్న లక్ష్మీప్రసన్న

రణస్థలం: రాష్ట్ర ప్రభుత్వం చక్కటి ఆలోచనతో చేపడుతున్న కుల గణన సర్వే శరవేగంగా సాగాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారిణి వి.ఎస్.ఎస్.లక్ష్మీప్రసన్న అన్నారు. రణస్థలం–2 సచివాలయ పరిధిలోని నగరప్పాలెం గ్రామంలో శనివారం చేపట్టి కులగణన సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా యాప్‌లో ఇచ్చిన అంశాలను కుటుంబ సభ్యులకు చదివి వినిపించాలన్నారు. తదుపరి సమగ్ర సమాచారం సేకరించి సర్వే పూర్తి చేయాలని సూచించారు. కుల ధ్రువీకరణ విషయంలో పూర్తి నిర్ధారణ తరువాత మాత్రమే సమాచారాన్ని పొందుపర్చాలన్నారు. ప్రభుత్వ పౌర సేవలలో కుల ధ్రువీకరణ సర్వే సమాచారం కీలకం కానుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు కె.రమణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ పి.సీతయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

ఇంటింటా రామజ్యోతి వెలిగించాలి

సరుబుజ్జిలి: అయోధ్యలో ఈ నెల 22న రామాలయ ప్రతిష్ఠ జరుతున్న సందర్భంగా ఆరోజు ప్రతీ ఇంటిలో రామజ్యోతిని వెలిగించాలని సేవాసమితి జిల్లా సమన్వయకర్త కణుగుల సత్య, జిల్లాప్రచారక్ వి.మాధవ్‌జీ కోరారు. రొట్టవలస వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధార్మిక జాగరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలల్లా ప్రతిష్ఠ సంచిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదపండితులు మావుడూరి సుబ్రహ్మణ్య శర్మ, రామసేవకులు దన్నాన రవికుమార్, మూడడ్ల రమణ, కిల్లి లక్ష్మీగోవిందరావు, చలపాక రమణ, యడ్ల ఆనందరావు, ముకుందరావు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న స్వామినాయుడు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని మునసబుపేట గురజాడ గాయత్రీ కళాశాల విద్యార్థులు హరిణి, రామ్‌ప్రసాద్‌లు రాయ్‌పూర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో ఉత్తమ సేవలందించినందుకు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ జి.వి.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు శనివారం అభినందించారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



పరామర్శలో నాయకులు

జి.సిగడాం: దవళపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్ తల్లి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఉదయ్‌కుమార్, తండ్రి ఆనందరావులను పార్టీ నాయకులు పేడాడ శ్రీరామమూర్తి, బత్తుల సన్యాసిరావు, బుడారి లక్ష్మణరావు, చందనాల రంగారావు, సత్తైరాజు, కృష్ణంరాజు, తులసీనాయడు శనివారం పరామర్శించారు.

ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలి



మాట్లాడుతున్న ఎంవీఐ సంజీవరావు

టెక్కలి: డ్రైవర్లు, వాహనచోదకులు ఏకాగ్రతతో డ్రైవింగ్ చేస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని టెక్కలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం టెక్కలి ప్రజా రవాణా డిపోలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది బి.ఎస్.ఎస్.మూర్తి, రామారావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని తోటపాలెం రోడ్డు సమీపంలో సాయిబాలాజీ అపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందినట్టు ఒకటో పట్టణ ఎస్సై బి.గణేష్ తెలిపారు. భార్య రమణమ్మతో మనస్పర్థల కారణంగా ఈ నెల 13న మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన అరసవల్లి రాము ఇప్పటి వరకు ఇంటికి తిరిగిరాలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

భీమిలి సభకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల శంఖారావాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర నుంచే ప్రారంభిస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. రణస్థలం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25న భీమిలిలో జరగనున్న భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలి రావాలని పిలుపు నిచ్చారు. కార్యకర్తలు, నాయకులకు త్వరలో జరగనున్న ఎన్నికల సన్నద్ధమయ్యేలా సీఎం జగన్ దిశా నిర్దేశం చేస్తారన్నారు. పార్టీ శ్రేణులకు ముఖ్యమంత్రి ఎంతో ప్రాముఖ్యత కల్పించారన్నారు. వలంటీర్లుగా, గృహసారథులుగా, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు వంటి నామినేటెడ్ పదవులతో పాటు ఎంతో మంది ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లుగా పదవులు పొందారన్నారు. అధికారంలో ఉంటేనే ప్రజలకు సేవ చేయగలమని, అలాగే మనకు ప్రజల్లో సముచితమైన స్థానం ఉంటుందని చెప్పారు. రానున్న రెండు నెలల్లో పార్టీ శ్రేణులంతా సైనికుల్లా పని చేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నాలుగు రోజులు గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల రమణ, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి వెంకటరత్నం ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెదరామినాయుడు, దన్నాన రాజినాయుడు, ముద్దాడ శంకర్, బత్తుల సన్యాసిరావు, జేసీఎస్ ఇన్‌చార్జిలు చిల్ల వెంకటరెడ్డి, మీసాల శ్రీనివాసరావు, డోల వెంకటరమణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



విన్నర్‌గా నిలిచిన కాశీబుగ్గ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ మురళి తదితరులు

కొత్తూరు: యువత క్రీడాల్లో రాణించాలని మేదర సంఘం రాష్ట్ర కోశాధికారి తెల్లి వైకుంఠరావు కోరారు. కొత్తూరుకు చెందిన సైనికుడు ఆరి నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు.. సైనికులుగా పనిచేస్తున్న గణేష్, దిలీప్‌లు తండ్రి జ్ఞాపకార్థం మేదరి యువకులతో జిల్లాస్థాయిలో ఈ నెల 18 తేదీ నుంచి మూడు రోజులు మెట్టూరు గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. 12 జట్లు తలపడగా.. కాశీబుగ్గకు చెందిన జట్టు విన్నర్‌గా, పొందూరు జట్టు రన్నర్‌గా, హిరమండలం జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు షీల్డ్, నగదు బహుమతులను స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ కె.మురళి, సంఘం కోశాధికారి వైకుంఠరావు టోర్నీ నిర్వాహకులు గణేష్, దీలీప్‌లు చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్ మాట్లాడుతూ.. సైనికులుగా పనిచేస్తూ ఇటువంటి సామాజిక దృక్పథంతో క్రీడలు పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. మేదరి సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు అభివృద్ధి చెందాలంటే పిల్లలను చదివించాలని కోశాధికారి కోరారు. టోర్నీ నిర్వాహకులు గణేష్, దీలిప్, తల్లి కళావతిలను జిల్లా సంఘం నాయకులు దుశ్శాలువతో సత్కరించారు. జిల్లా సంఘం కార్యవర్గ సభ్యుడు ఆరి కోవిందరావు, మండల అధ్యక్షుడు ఆరి రాజారావు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మొక్కజొన్న సాగు



మిరియాపల్లి వద్ద మొక్కజొన్న సాగు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది రబీలో వాణిజ్య పంటగా సాగుచేస్తున్న మొక్కజొన్న ఆశాజనకంగా ఉంది. గత ఏడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగిందని మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ తెలిపారు. గత ఏడాది 500 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఈ ఏడాది వెయ్యి ఎకరాలకు పైగా సాగు చేస్తున్నట్లు వివరించారు. మండలంలోని వంశధార నదీతీర గ్రామాలైన దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, పెద్దకోట, బసవరాజుపేట, లక్ష్మీనర్సుపేట గ్రామాలతో పాటు ధనుకువాడ, స్కాట్‌పేట, మోదుగువలస తదితర గ్రామాల్లోను విస్తారంగా సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంట వేసుకున్నప్పటి నుంచి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో పంట ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం సాగు నీటికి ఇబ్బంది లేదన్నారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ

నరసన్నపేట: స్థానిక వంశధారనగర్ సమీపంలో నివసిస్తున్న నిరుపేద సంచార కుటుంబాలకు పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. సర్పంచ్ బూరల్లి శంకర్ నేతృత్వంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదలను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కృష్ణచైతన్య ఈసందర్భంగా సూచించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చదువు ఈడు పిల్లలు ఉంటే పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పొట్నూరు సాయిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెదిరెడ్ల రాములు ఉన్నారు.

శ్రీరామ పాదుకా పూజపై ర్యాలీ

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన ఉన్న యెరుకొల ఆవరణలో ఈ నెల 22న నిర్వహించనున్న శ్రీరామ పాదుకా పూజా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పాతపట్నం శ్రీరామ సేవా సమితి కోరారు.